క్లుప్తంగా

నాణ్యమైన భోజనం వడ్డించాలి



భోజనాన్ని రుచిచూస్తున్న జడ్జి వెంకటేశ్వరరావు

ఆత్మకూరు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సీనియర్ సివిల్‌జడ్జి వెంకటేశ్వర రావు అన్నారు. పట్టణంలోని కస్తూరిబా పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పుష్టిగా భోజనం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. గదుల శుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలిగించవద్దని, హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అస్వస్థతకు గురైన వారిని ఇళ్లకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు బలరాం నాయక్, హుస్సేన్ మియా, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీ దేవికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి కుంకుమపూజ నిర్వహిస్తున్న మహిళలు

పాములపాడు: మండల కేంద్రంలోని చౌడేశ్వరీ దేవి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు కోదండరామయ్య మాట్లాడుతూ అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ చేసి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక అలంకరించి కుంకుమార్చ, గణపతి పూజ, సహస్రనామావళి, పంచామృతాభిషేకం, ప్రసాద వితరణ కార్యక్రమాలతో పూజలు చేపట్టినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

'జగనన్న గోరు ముద్ద' అమలు భేష్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ భారతి, ఎంఈఓ సుభాన్

పగిడ్యాల: సంపూర్ణ అక్షరాస్యత సాధనే ధ్యేయంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరు ముద్ద పథకం భేషుగ్గా ఉందని తహసీల్దార్ భారతీ, ఎంఈఓ సుభాన్ అన్నారు. శనివారం మండలంలోని పగిడ్యాల ట్యాంక్ బడి పాఠశాల, లక్ష్మాపురంలోని తెలుగు, ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. స్వీట్ పొంగల్, ఆకు కూరలతో తయారు చేసిన పప్పు చారు రుచికరంగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ పాటించకపోతే శ్రీ మెన్ కమిటీ తీర్మానంతో ఏజెన్సీని రద్దు చేయిస్తామని నిర్వాహకులను హెచ్చరించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. రెండవ తరగతి పిల్లలకు చదవడం, రాయడం నేర్పించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. ఉర్దూ పాఠశాలలో నాడు నేడు పథకం కింద చేపట్టిన పనులను పరిశీలించి నాణ్యతతో చేయించాలని ఆదేశించారు.

చెక్ పాయింట్లను త్వరితగతిన పూర్తి చేయండి



మాసపేటలో చెక్‌పాయింట్‌ను తనిఖీ చేస్తున్న డీడీఐ ఆఫ్ సర్వే ఉమాపతి

మిడుతూరు: రీ సర్వే చెక్ పాయింట్లను త్వరితగతిన పూర్తి చేయాలని డివిజనల్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఉమాపతి, నాగశ్రీ అన్నారు. శనివారం మండల పరిధిలోని చింతలపల్లి, మాసపేట గ్రామాల్లో రీ సర్వే చెక్‌పాయింట్లను తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకంలో సమగ్ర భూ సర్వే చేపడుతున్నారన్నారు. అందులో భాగంగా రీ సర్వే చెక్‌పాయింట్లను గ్రామ సర్వేయర్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో సర్వేను ప్రారంభించేందుకు వీలవుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ కృష్ణుడు, గ్రామ సర్వేయర్లు జుబేర్, ఆజీమ్, చంద్రబాబు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సిబ్బందికి సన్మానం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా పూర్తవ్వడాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం పారిశుద్ధ్య విభాగంలో పనిచేసే సిబ్బందికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం ఈఓ ఎస్ లవన్న ఆదేశాల మేరకు పారిశుద్ధ్య విభాగ సహాయ కార్యనిర్వాహణాధికారి ఫణిధరప్రసాద్ పారిశుద్ధ్య సిబ్బందికి శ్రీస్వామివారి శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలను అందజేసి సత్కరించారు.

మురి'పింఛన్'

- టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ మంజూరుకు అనేక అడ్డంకులు
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అర్హత ఉంటే చాలు వెంటనే మంజూరు
- గతంలో నగదు పొందేందుకు కార్యాలయాల వద్ద పడిగాపులు
- ప్రస్తుతం 1వ తేదీన ఇంటి వద్దే అందజేత
- సంబర పడుతున్న లబ్ధిదారులు



ఆత్మకూరు పట్టణంలో లబ్ధిదారుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

ఆత్మకూరు: టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ మంజూరు కావాలంటే అనేక అడ్డంకులు ఉండేవి. కుటుంబంలో లేదా గ్రామాల్లో ఎవరైనా మృతి చెందితే తప్ప మరొకరికి కొత్త పింఛన్ మంజూరు అయ్యేది కాదు. ఫలితంగా అన్ని అర్హతలున్నప్పటికీ నెలల తరబడి ఎదురు చూసే దుస్థితి ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హత ఉంటే చాలు నూతన పింఛన్లు మంజూరు చేయడంతో పాటు ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేయడంతో లబ్ధిదారులు సంబరపడుతున్నారు. అవస్థలు తప్పడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

త్వరితగతిన మంజూరు

శ్రీశైలం నియోజకవర్గంలో త్వరిత గతిన పింఛన్లు మంజూరు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కింది. అర్హత ఉంటే చాలు కులం, మతం, రాజకీయాలు చూడకుండా నేరుగా లబ్ధిదారుల ఇళ్లముంగిళ్లకు చేరుతున్నాయి. అంతేకాకుండా దరఖాస్తు చేసుకునేందుకు కూడా ఎవరి వద్దకూ వెళ్లాల్సిన పని లేకుండా అర్హత ఉంటే వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి దరఖాస్తు చేయిస్తున్నారు. త్వరిత గతిన మంజూరయ్యేల చర్యలు తీసుకుంటున్నారు. నియోజకవర్గంలో గతేడాది 29,530 పింఛన్‌దారులుండగా జనవరిలో కొత్తగా 994 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం నియోజకవర్గంలో మొత్తం 30,524 మంది పింఛన్ పొందుతున్నారు. అదే టీడీపీ ప్రభుత్వ హయాంలో అయితే పింఛన్ మంజూరు అటుంచి దరఖాస్తు చేసుకునేందుకు కార్యాలయాల చుట్టూ, ఆ పార్టీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేంది. అంతేకాకుండా వారి అనుగ్రహం ఉంటేనే పింఛన్ మంజూరయ్యేది.

ఇంటివద్దకే పింఛన్

టీడీపీ పాలనలో గ్రామాల్లో ఏదో ఒక కూడలిలో ఆ గ్రామ వీఆర్వో ద్వారా లేదా పంచాయతీ కార్యదర్శి ద్వారా పింఛన్ పంపిణీ చేసేవారు. పింఛన్ సొమ్ము తీసుకోవాలంటే వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఒక్కోసారి ఆ తరువాతి రోజు కూడా రావాల్సిన పరిస్థితి ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా పింఛన్ ఇంటి వద్దనే అందజేస్తున్నారు. అదికూడా ప్రతి నెల 1వ తేదీన తెల్లవారక ముందే నగదు ముట్టజెబుతుండటంతో వితంతువులు, వృద్ధులు, వికలాంగులు మురిసిపోతున్నారు.

ప్రతినెలా రూ.2,750

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో వృద్ధులకు, వికలాంగులకు, వితంతవులకు పింఛన్ రూ.2 వేల నుంచి పెంచుతూ రూ.3 వేలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు మూడేళ్లలో ప్రతి ఏడాది పింఛన్ పెంచుతూ ప్రస్తుతం రూ.2,750 చొప్పున అందిస్తున్నారు.

తొలి పింఛన్ రూ.2,750 అందుకున్నా



ఆధార్‌కార్డు ఆధారంగా పింఛన్ కోసం వలంటీర్‌ను అడిగాను, వలంటీర్ దరఖాస్తులు తీసుకుని పరిశీలించి సచివాలయంలో ఉద్యోగిని కలవమన్నారు. ఉద్యోగిని కలిసిన 3 నెలలకే పింఛన్ మంజూరు అయ్యింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తొలి పింఛన్ కానుకగా నాకు రూ.2,750లు ఇవ్వడం నిజంగా కొత్త సంవత్సరం పండుగలా ఉంది. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– చోటబీ, ఆత్మకూరు

వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటుంది



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ మంజూరు చేయడం ఆనందంగా ఉంది. తొలిసారిగా పింఛన్ తీసుకున్నా. వృద్ధాప్యంలో ఈ డబ్బులు నాకు ఆసరాగా ఉపయోగపడతాయి. ముఖ్యమంత్రి మేలును మరిచిపోలేను.

– హుస్సేన్‌బీ, ఆత్మకూరు

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు



అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు చేశాం. ఇంకా అర్హులైన వారెవరైనా ఉంటే దరఖాస్తు చేసుకుంటే వారికి కూడా మంజూరు చేస్తాం. ప్రభుత్వం నియమాల ప్రకారం అర్హత ఉంటే చాలు ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందజేస్తాం.

– శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్, ఆత్మకూరు

ఉమెన్ హెల్ప్ డెస్క్ ప్రారంభం

వెలుగోడు: స్థానిక పోలీసు స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఉమెన్ హెల్ప్ డెస్క్‌ను, స్పందన గదిని ఎస్‌ఐ జగన్‌మోహన్ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. వేధింపులకు గురైన ప్రతి మహిళా ధైర్యంగా పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసేందుకే మహిళా సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళల రక్షణకు పోలీస్ వ్యవస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలు తమ సమస్యలను స్పందన కార్యక్రమంలో తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు బాబు, షాషావలి, సిబ్బంది నరసింహులు, వెంకటస్వామి, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

జూపాడుబంగ్లా: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం చేశారంటూ శనివారం సీపీఎం ఆధ్వర్యంలో నందికొట్కూరు పటేల్ సెంటర్‌లో ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేకహోదా, విభజన హామీలను ఇప్పటిదాకా నెరవేర్చలేదన్నారు. రూ.45లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ఆంధ్రప్రదేశ్‌కు మొండిచెయ్యి చూపారన్నారు. విభజన హామీలతో పాటు పోలవరం, విశాఖరైల్వేజోన్, ఎన్‌ఐటీ, ఐఐటీ, ట్రిపుల్‌ఐటీ, కడప స్టీల్‌ప్లాంటు, వైజాగ్ మెట్రో, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు కేటాయించకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. అంతేకాకుండా ఉపాధి హామీ పథకానికి రూ.30వేల కోట్లు కోత విధించారని తెలిపారు. కార్యక్రమంలో పక్కీర్‌సాహెబ్, ఓబులేసు, వెంకటేశ్వర్లు, రంగమ్మ, హుసేనమ్మ, బీబీ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో టీకాలు వేయాలి



బ్రాహ్మణకొట్కూరు పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న ఇమ్యునైజేషన్ అధికారిణి

జూపాడుబంగ్లా: నిర్ణీత సమయంలో చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ ప్రభావతి సూచించారు. శనివారం బ్రాహ్మణకొట్కూరు, జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ముందుగా ఆయా పీహెచ్‌సీల్లోని రికార్డులను తనిఖీ చేశారు. ఏఏ పీహెచ్‌సీకి ఏఏ రకాల వ్యాక్సిన్లు ఎంత మోతాదులో మంజూరయ్యాయి, వాటిని ఇప్పటి దాకా ఎంత మంది చిన్నారులకు వినియోగించారు, ఇంకా ఎంతమందికి టీకాలు వేయాల్సి ఉంది అనే విషయాలపై బ్రాహ్మణకొట్కూరు డాక్టర్ సుబ్రమణ్యం, జూపాడుబంగ్లా డాక్టరు సబా, గంగాధర్‌లతో ఆరా తీశారు. అలాగే టీకాలను ఎంత టెంపరేచర్‌లో నిల్వచేశారంటూ పరిశీలించారు. వ్యాక్సిన్ నిల్వ వినియోగంపై ఆరోగ్య సిబ్బందికి సూచనలిచ్చారు. అలాగే బ్రాహ్మణకొట్కూరు ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వహబ్, సూపర్‌వైజర్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా ప్రచారం



తరిగోపులలో ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

జూపాడుబంగ్లా: వైఎస్సార్‌సీపీ బలపరచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నుపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, వైఎస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రాడ్యుయేట్ ఓటర్లను కోరారు. శనివారం మండలంలోని తరిగోపుల గ్రామంలో పి.లింగాపురం సర్పంచ్ నాగార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు తరుణ్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఓటును అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, అల్లీసాహెబ్, శ్రీనివాసరెడ్డి, గోపాల్‌రెడ్డి, వెలమనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

28లోగా ఈ-కేవైసీ పూర్తి చేయండి

కొత్తపల్లి: ఈనెల 28వ తేదీలోపు ఈ–కేవైసీ పూర్తి చేయాలని ఏఓ కె.మహేష్ సూచించారు. శనివారం పెద్దగుమ్మడాపురం, ముసలిమడుగు, ఎర్రమఠం ఆర్‌బీకేలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో రబీ సీజన్‌లో పంటలు సాగుచేసి పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. ఆర్‌బీకే సిబ్బంది ఈకేవైసీ చేయించుకోని రైతులతో మాట్లాడి అవగాహన కల్పించి చేయించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా రైతులకు పంట నమోదు, ఈ కేవైసీ ప్రయోజనాలను వివరించారు.

పగిడ్యాల: రబీ సీజన్ కింద పంట నమోదు చేయించుకున్న రైతులు తప్పనిసరిగా ఈనెలాఖరులోగా ఈ–కేవైసీ చేయించుకోవాలని ఏఓ విజయ్‌జ్యోతు కుమార్ సూచించారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 75 శాతం మంది రైతులు ఈ–కేవైసీ చేయించుకున్నారన్నారు. ఇంకా మిగిలిన రైతులు ఈనెల 28వ తేదీలోగా ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులను కలిసి ఈ–కేవైసీ చేయించుకోవాలని వెల్లడించారు.

నీటి సమస్య పరిష్కరించండి



ఈఓపీఆర్డీ మణిమంజరికి సమస్యను వివరిస్తున్న తరిగోపుల గ్రామస్తులు

జూపాడుబంగ్లా: మండలంలోని తరిగోపుల గ్రామంలోని చేతిపంపును తొలగించిన వ్యక్తిపై చర్యలు తీసుకొని తమకు తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్డీ మణిమంజరిని కలిసి సమస్యను వివరించారు. గ్రామంలోని కుళాయిలకు రెండు రోజుల నుంచి నీరు సరఫరా కాకపోవటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కుళాయిలకు నీళ్లరాని సమయంలో సమీపంలోని చేతిపంపు నీటిని పట్టుకునేవారమని తెలిపారు. ఆ చేతిపంపును గ్రామానికి చెందిన వ్యక్తి తీసివేశాడని, కుళాయిని కూడా ఆక్రమించుకొని అతనొక్కడే వాడుకుంటున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు.

రేపు రేనాటి సూర్యచంద్రుల సంస్మరణ సభ

నంద్యాల(వ్యవసాయం): రేనాటి సూర్యచంద్రుల సంస్మరణ సభను సోమవారం వివేకానంద ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు రేనాటి సూర్యచంద్రుల స్మారక సమితి కార్యదర్శి కర్నాటి రామకృష్ణారెడ్డి, అంతర్జాతీయ మాజీ శాస్త్రవేత్త రవీంద్రనాథ్ శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కలియుగ దానకర్ణుడు బుడ్డా వెంగళరెడ్డి సంస్మరణార్థం 27న సాయంత్రం 4గంటలకు సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, రచయితలు, కవులు, మేధావులు పాల్గొంటారని పేర్కొన్నారు.

మద్దతు ధరతో జొన్న కొనుగోళ్లు



రైతులతో మాట్లాడు ఏడీఏ ఆంజనేయులు

వెలుగోడు: జొన్నలను మద్దతు ధరకు రైతుల నుంచి నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయులు తెలిపారు. శనివారం వేల్పనూరు, రేగడగూడురు గ్రామాల్లో ఏఓ సునీతతో కలిసి జొన్న కొనుగోళ్లను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 2023వ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా గుర్తించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి జొన్న పంటను కొనుగోలు చేయాలని నిర్ణయించిందన్నారు. మండలంలో కొనుగోళ్లను జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ శాఖ వెలుగోడు బ్రాంచి మేనేజర్ మాలాలి చేపడతారని తెలిపారు. కొనుగోలు సమయంలో రైతులకు ప్రభుత్వమే ఉచితంగా గోనెసంచులను సరఫరా చేస్తుందని, ట్రాన్స్‌పోర్ట్, హమాలీ ఖర్చులను (క్వింటాలకు రూ.22 చొప్పున) ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. కొనుగోలు చేసిన జొన్నలను ప్రజలకు పౌరసరఫరా శాఖ ద్వారా బియ్యంతో పాటు ఉచితంగా సరఫరా చేస్తుందని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, నాయకులు దేశం తిరుపంరెడ్డి, కుల్లాయిస్వామిరెడ్డి, బన్నూరు అంకిరెడ్డి, సర్దార్ మియా, మహేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొలాల వద్దే ధాన్యం కొనుగోలు

పాములపాడు: ప్రభుత్వం నిర్ణయించిన ధరకే పొలాల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేస్తారని వ్యవసాయ విస్తరణాధికారి మద్దిలేటి తెలిపారు. శనివారం మండలంలోని వాడాల గ్రామంలో జొన్న పంట కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జొన్నలను మద్దతు ధర క్వింటా రూ.2,970 నిర్ణయించిందని తెలిపారు.

లేని ఆశ్రమానికి చందాల వసూలు

- బానకచర్ల కాశిరెడ్డి నాయన ఆశ్రమం, గోశాల పేరుతో రసీదు పుస్తకాల ముద్రణ
- రూ.వేలల్లో చందాల వసూలు
- గ్రామంలో అసలు ఆశ్రమమే లేదంటున్న గ్రామస్తులు



ఆశ్రమం, గోశాల అభివృద్ధి పేరుతో వసూలు చేసిన చందా రసీదు

పాములపాడు: కాశిరెడ్డినాయన అంటే రాష్ట్రంలో దాదాపు తెలియని వారుండరు. ఆయన పేరున ఆశ్రమం నిర్వహిస్తున్నారని చెబితే చందాలు ఇవ్వని వారు లేరనడంలో అతిశయోక్తి లేదు. దీనినే అసరగా చేసుకొని కొందరు కాశిరెడ్డి నాయన ఆశ్రమం, గోశాల అభివృద్ధి కోసం చందా అంటూ బానకచెర్ల గ్రామానికి చెందిన కొందరు ముఠాగా ఏర్పడి కొత్త రకమైన మోసానికి తెరతీశారు. బానకచెర్ల గ్రామంలో కాశిరెడ్డినాయన ఆశ్రమమే లేదు. ఈ విషయం ఈ ప్రాంత వాసులందరికీ తెలుసు. గ్రామంలో ఇప్పటి వరకు గోశాల నిర్మాణానికి పునాదిరాయి కూడా పడలేదని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే ఈ ముఠా సభ్యులు కాశిరెడ్డి నాయన భక్తుల వద్దకు వెళ్లి ఆశ్రమం, గోశాల అభివృద్ధి అని చెబుతూ ఒక్కొక్కరి నుంచి రూ.వేలల్లో వసూలు చేసినట్లు తెలిసింది.

అనుమానం రాకుండా ఖరీదైన దుస్తులు

ఈ ముఠా సభ్యులు ఆధ్యాత్మికం ప్రతిబింబించేలా ఖరీదైన దుస్తులు ధరించి, ఈ వసూళ్లతో వచ్చిన డబ్బుతో కారు కొనుగోలు చేసినట్లు తెలిసింది. వీరు జిల్లాతో పాటు రాష్ట్ర నలుమూలలా పర్యటిస్తూ వసూళ్లకు పాల్పడుతూ విలాసవంతమైన జీవనం సాగిస్తున్నారు. కేవలం రసీదు పుస్తకాలు ముద్రించి బ్యాంకు ఖాతా నెంబరు, ఫోన్ పే నెంబర్లను ముద్రించి యథేచ్ఛగా వసూళ్లకు పాల్పడుతున్నారు.

వెలుగుచూసిందిలా..

నంద్యాలకు చెందిన రాజగోపాల్‌రెడ్డి అనే వ్యక్తి నుంచి రూ.3,500 చెల్లించి రసీదు పొందాడు. అయితే అనుమానం వచ్చి బానకచెర్ల గ్రామంలో తనకు తెలిసిన వాళ్లకు రసీదును వాట్సప్ చేసి విచారించాడు. దానిని చూసిన గ్రామస్తులు నివ్వెరపోయారు. గ్రామంలో ఆశ్రమమే లేదు, ఈ రసీదు ఎక్కడిదని గ్రామంలో చర్చించుకుంటున్నారు. ఇలాంటి వాటితో తమ గ్రామానికి చెడ్డ పేరు వస్తుందని మండిపడుతున్నారు.

గతంలోనూ ఇలాగే..

మండలంలోని బానుముక్కల మలుపు వద్ద బండ్లమూరి భూపిరెడ్డి, శివరామకృష్ణయ్యలు ఆంజనేయుని భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి శివరాత్రి, ఉగాది పండుగ దినాల్లో పాదయాత్రికులకు సొంత ఖర్చులతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని కూడా ఓ ముఠా వసూళ్లకు తెరతీయడం జరిగింది. కర్ణాటక, మహారాష్ట్రలకు వెళ్లి తాము ముద్రించుకున్న రసీదులు చూపిస్తూ విగ్రహ ఏర్పాటు చేశాము. అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పి వసూళ్లకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న అసలు నిర్వాహకులు పత్రికల ద్వారా మోసగాళ్ల విషయం గుట్టు రట్టు చేశారు. ఇలాంటి మోసగాళ్లతో గ్రామాలకు చెడ్డపేరు వస్తుందని, ఇలాంటి వసూళ్లకు పాల్పడుతున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పాఠశాలలకు డెస్కుల పంపిణీ

కొత్తపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మనబడి నాడు....నేడు పథకం కింద డెస్కులు పంపిణీ చేసినట్లు ఎంఈఓ శ్రీరాములు శనివారం తెలిపారు. మండలంలోని 23 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలు, 7 అంగన్‌వాడీ కేంద్రాలు రెండో విడత నాడు–నేడు పథకం కింద ఎంపికయ్యాయని వివరించారు. ప్రభుత్వం పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు సుమారు రూ.7.2 కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. అందులో భాగంగానే దుద్యాల, ముసలిమడుగు, గోకవరం, శివపురం గ్రామాలలోని ఉన్నత పాఠశాలలు, గువ్వలకుంట్ల స్పెషల్ పాఠశాలకు డెస్కులు అందజేసినట్లు వెల్లడించారు.

తహసీల్దార్ కార్యాలయం పరిశీలన



తహసీల్దార్ సీటులో ఎండీ చిన్నరాముడు

జూపాడుబంగ్లా: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ చిన్నరాముడు జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం పరిశీలించారు. విజయవాడ నుంచి కర్నూలుకు వెళ్తూ మార్గమధ్యలో ఆయన తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ముందుగా కార్యాలయ డీటీ నాగన్న, సీనియర్ అసిస్టెంటు శ్రీరంగారెడ్డి, ఏఎస్ఓ హనుమంతు ఆయనకు సాదర స్వాగతం పలికారు. కార్యాలయంలోని తహసీల్దార్ సీటులో కూర్చొని తాను 2005లో ఇదే సీటులో కూర్చొని జూపాడుబంగ్లా మండల తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించినట్లు చిన్నరాముడు గుర్తు చేసుకున్నారు. ప్రస్తుత తహసీల్దార్ పుల్లయ్య యాదవ్ కార్యాలయం పెంచిన చెట్లను పరిశీలించి ఆయనను ప్రశంసించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభం విరిగిన దృశ్యం

మిడుతూరు: మిడుతూరు ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాన్ని చొప్ప లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టడంతో స్తంభం విరిగి, విద్యుత్ సర్క్యూట్‌తో చొప్ప దగ్ధమైన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన హర్షవర్ధన్ ట్రాక్టర్‌లో చొప్పను లోడ్ చేసుకొని ఖాజీపేట వెళ్తుండగా స్థానిక ఎస్సీ కాలనీలో రోడ్డుకు పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి ట్రాక్టర్ డోర్ తగలడంతో స్తంభం విరిగిపడింది. ఆ సమయంలో కాలనీలో కాలనీవాసులు ఎవరూ లేకపోడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ సర్క్యూట్ కావడంతో చొప్పకు మంటలు చెలరేగాయి. డ్రైవర్ చాకచక్యంగా ఊరిబయటకు వెళ్లి ట్రాక్టర్ ట్రాలీలో ఉన్న చొప్పను ఓ రైతు పొలంలో కుప్పలు, కుప్పలుగా వదిలాడు. విద్యుత్ శాఖ ఏఈ సంఘటనా స్థలానికి చేరుకొని నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. అలాగే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ట్రాక్టర్ యజమానిపై ఫిర్యాదు చేశారు. విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో దాదాపు రూ. 20 వేలు నష్టం వాటిల్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

పాడి రైతులకు రూ.25.77లక్షల బోనస్

రుద్రవరం: స్థానిక విజయ మినీ డెయిరీకి పాలు పోస్తున్న రైతులకు బోనస్ కింద నంద్యాల విజయ పాల డెయిరీ నుంచి రూ.25,77,160 మంజూరయ్యాయని మేనేజర్ శివశంకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక డెయిరీలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది రైతులు విజయ డెయిరీకి 13.06 లక్షల లీటర్ల పాలు పోశారన్నారు. ఇందుకు సంబంధించి ఒక్కో లీటర్‌కు రూ.2 చొప్పున బోనస్ మంజూరైందని చెప్పారు.ఆ మొత్తాన్ని స్థానిక మినీ డెయిరీ పరిధిలోని 42 కేంద్రాల్లో పాలు పోస్తున్న పాడి రైతులకు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే పలు కేంద్రాల్లో రైతులకు బోనస్ సొమ్ము పంపిణీ చేశారన్నారు. మిగిలిన కేంద్రాల్లో పంపిణీ కొనసాగుతోందన్నారు.

ఆటో వర్కర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

జూపాడుబంగ్లా: ఆటోవర్కర్ల సంక్షేమం కోసం బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు భాస్కర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, పక్కీర్ సాహెబ్ డిమాండ్ చేశారు. శనివారం నందికొట్కూరు పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ డిగ్రీ చదివిన ఎంతో మంది నిరుద్యోగులు ఉద్యోగాలు దొరకక పొట్టకూటి కోసం ఆటోవర్కర్లుగా మారుతున్నారన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచటం వల్ల ఆటో వర్కర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రమేష్, స్వీటు రమేష్, చిన్నస్వాములు, దానం, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ పాత్రికేయుడి మృతి



మోహన్‌రెడ్డి(ఫైల్)

పాములపాడు: మండల కేంద్రానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు గంగారపు మోహన్‌రెడ్డి (52) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. మండలంలోని పాత్రికేయులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న తహసీల్దార్, కళాశాల చైర్మన్, డైరెక్టర్లు

జూపాడుబంగ్లా: విద్యార్థులు కష్టపడి పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని తహసీల్దార్ రాజశేఖర్‌బాబు అన్నారు. శనివారం నందికొట్కూరు పట్టణంలోని బసిరెడ్డి డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఆనందోత్సవాల మధ్య నిర్వహించారు. ముందుగా తహసీల్దార్ రాజశేఖర్ బాబు, కళాశాల చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, కరస్పాండెంట్ సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు పలురకాల సంస్కృతులు ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూదిరెడ్డి రమేష్‌రెడ్డి, డైరెక్టర్లు రామచంద్రారెడ్డి, శ్రీకాంత్, రమేష్, శ్రీనాథ్, ప్రిన్సిపాల్ జాన్‌ఎలీషా తదితరులు పాల్గొన్నారు.